క్లుప్తంగా

మైక్ శబ్దాలపై చర్యలు

మణుగూరురూరల్: పరీక్షలకు సన్నద్ధమవుతున్న ఇంటర్, డిగ్రీ, పదో తరగతి విద్యార్థులకు మైక్ శబ్దాలతో ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మణుగూరు తహసీల్దార్ రాఘవరెడ్డి హెచ్చరించారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 29వ తేదీ నుండి ఇంటర్, మార్చి, ఏప్రిల్ నెలల్లో పది, డిగ్రీ పరీక్షలు జరుగనున్న నేపథ్యంలో విద్యార్థులు పరీక్షల కోసం తెల్లవారుజామున్నే లేచి చదువుకుంటుంటారని, ఈ క్రమంలో మండల వ్యాప్తంగా ఉన్న అన్ని మతాల ప్రార్థనా మందిరాల వారు తమ మైక్ సౌండ్స్‌తో విద్యార్థులకు ఇబ్బంది కలిగించొద్దని సూచించారు. నిబంధనలు ఎవరూ అతిక్రమించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు

అశ్వాపురం: మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామ పంచాయతీలో 2022–23 సంవత్సరంలో అక్కడక్కడ కొంత మట్టి పోసి ఎనిమిది లక్షల రూపాయలకు గ్రావెల్ రోడ్లకు ఎంబీ రికార్డులు చేశారని, గ్రావెల్ రోడ్ల నిర్మాణంపై సమగ్ర పరిశీలన చేపట్టాలని గ్రామ అఖిల పక్ష పార్టీల నాయకులు సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ప్రియాంక అలకు వినతిపత్రం అందజేశారు. 40 ఎంఎం మెటల్ రోడ్లపై గ్రావెల్ పోసినట్టుగా వెంటనే ఆ రోడ్లపై సీసీరోడ్డులు పోసి వాటి అడుగున గ్రావెల్ పోసినట్టు ఎంబీ రికార్డులు చేశారని వివరించారు. ఎంపీడీఓ వరప్రసాద్‌కూ నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బేతం రామకృష్ణ, మాజీ సర్పంచ్ స్వర్గం బాలనర్సయ్య, అఖిలపక్ష పార్టీల నాయకులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

చర్ల: మండలంలోని దానవాయిపేటలో గిరిజన రైతుకు చెందిన మిర్చి పంటలకు నిప్పంటించి దగ్ధం చేసిన దుండగులను గుర్తించి వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం పార్టీ నియోజకవర్గ కన్వీనర్ మచ్చా వెంకటేశ్వరావు డిమాండ్ చేశారు. దానవాయిపేటలో కుంజా భద్రయ్యకు చెందిన రెండెకరాల మిర్చి పంట కోసి కళ్లంలో ఆరబోసిన సందర్భంలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించగా దగ్ధమైన మిర్చి పంటను సోమవారం సీపీఎం బృందం సందర్శించింది. నాయకులు రైతును ఓదార్చారు. ఈ సందర్భంగా మచ్చా వెంకటేశ్వర్లు మాట్లాడారు. రెవెన్యూ, వ్యవసాయశాఖాధికారులు పంట దగ్ధంపై వివరాలను నమోదు చేసి ప్రభుత్వానికి తెలియజేసి పరిహారం ఇప్పించాల్సిందిపోయి కనీసం పట్టించుకోకపోవడం దుర్మార్గం అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి కారం నరేష్, నాయకులు మచ్చా రామారావు, బందెల చంటి, పామారు బాలాజీ, కుంజా వెంకటేశ్వర్లు, నూపా కృష్ణ, మూర్తి పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌తోనే ప్రమాదాలు

భద్రాచలంఅర్బన్: మద్యం సేవించి వాహనాలను నడపడం వల్లనే అత్యధిక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని భద్రాచలం ఎస్సై శ్రీనివాస్‌రావు అన్నారు. సోమవారం పట్టణంలోని బ్రిడ్జి సెంటర్‌లో ఆయన తన సిబ్బందితో కలిసి డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడితే శిక్షలు ఉంటాయని హెచ్చరించారు. తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నియమనిబంధనలు పాటించాలని హెచ్చరించారు. కార్యక్రమంలో టౌన్ పోలీస్‌స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

నిందితులను అరెస్ట్ చేయాలి

భద్రాచలంఅర్బన్: సిద్దిపేట మండలం బక్రిచెప్యాల గ్రామంలో మహాత్మా గాంధీ విగ్రహాన్ని కొందరు దుండగులు ధ్వంసం చేయడాన్ని జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు చారుగుళ్ల శ్రీనివాస్ తీవ్రంగా ఖండించారు. ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిని గుర్తించి వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన పత్రికా ప్రకటన విడుదల తెలిపారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా దుండగులను కఠినంగా శిక్షించాలని ఆయన కోరారు.

చండ్రుగొండ: సిద్దిపేట మండల బక్రీచెప్యాల గ్రామంలో మహాత్మాగాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండుగులను పట్టుకుని కఠినంగా శిక్షించాలని ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు పసుమర్తి శేషగిరిరావు సోమవారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రకటన విడుదల చేసినవారిలో సంఘం నాయకులు సంకా శంకర్, కొదుమూరి జనార్దన్, డి.రామారావు, కృపాకర్ ఉన్నారు.

జయప్రదం చేయండి

దమ్మపేట: ఖమ్మంలో నిర్వహించనున్న సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ యూనిటీ మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి అమర్లపూడి రాము పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని జమేదారుబంజర గ్రామంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అమర్లపూడి రాము మాట్లాడుతూ... ఖమ్మం పట్టంలో మార్చి నెల 3, 4, 5 తేదీల్లో మూడు రోజుల పాటు సభలు జరగనున్నట్లు తెలిపారు. నాయకులు తొడెం దుర్గమ్మ, కాకా వెంకటేష్, కుర్సం ముత్యాలరావు, తాటి సత్యం, కాంతారావు పాల్గొన్నారు.

సమస్యల చెంత వారపుసంత

- తాగునీరు లేదు, మరుగుదొడ్లు లేవు..
- కొనుగోలుదారులు, చిరువ్యాపారులకు ఇబ్బందులు
- పట్టించుకోని పాలకవర్గం


చర్లలోని వారపు సంత ప్రాంతం

చర్ల: చర్లలోని వారపు సంత సమస్యల చెంతన ఉంది. పంచాయతీకి పన్నుల పేరిట లక్షలాది రూపాయలు సమకూరుతున్నప్పటికీ సంతలో కనీస సౌకర్యాలను కల్పించకపోవడంతో ఇటు సరుకులు విక్రయించుకనే చిరు వ్యాపారులు అటు వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వ్యాపార సముదాయానికి అడ్డాగా మారిన చర్ల సంతలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి పంచాయతీ పాలకవర్గం, అధికారులు చొరవ చూపకపోవడంతో ఏళ్ల తరబడిగా సమస్యలు అలానే ఉన్నాయి.

మెండుగానే ఆదాయం..

ఏజెన్సీ మండలాలకు, గ్రామాలకు కూడలిగా ఉన్న చర్లలో ప్రతీ ఆదివారం వారపు సంత జరుగుతుంది. చర్ల, దుమ్ముగూడెం, వెంకటాపురం మండలాలతో పాటు పొరుగున ఉన్న ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుకుమా, బీజాపూర్, దంతెవాడ జిల్లాల్లోని అటవీ ప్రాంత గ్రామాలకు చెందిన సుమారు 10 వేల మంది కొనుగోలుదారులు ఇక్కడికి వస్తుంటారు. వెయ్యి మంది వరకు చిరు వ్యాపారులు సరుకులు, కూరగాయలు, ఆకుకూరలు ఇతర వస్తువులును విక్రయించేందుకు వస్తుంటారు. దీంతో ప్రతీ సంవత్సరం గ్రామపంచాయతీ మార్కెట్ ఆశీలు పేరిట పంచాయతీకి రూ.సుమారు 10 లక్షల మేర ఆదాయం సమకూరుతోంది. రోజుకు రూ.50 చొప్పున ఆశీలు వసూలు చేస్తుండగా ఆ మేరకు ఆదాయం అందుతోంది.

సమస్యలు ఇలా..

ఇతవరకు బాగానే ఉన్నా.. ఆదాయానికి తగ్గట్టు వసతులు ఏర్పాటు చేయడంతో నిర్వాహకుల వైఫల్యం తేటతెల్లమవుతోంది. వ్యాపారులు ప్రతీ ఆదివారం ఉదయం 7 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు అంటే 12 గంటల పాటు చర్లలో ఉండి తమ వ్యాపార కార్యకలాపాలను కొనసాగిస్తుంటారు. కొనుగొళ్లుదారులు సైతం దూర ప్రాంతాల నుంచి ఇక్కడకు చేరుకుంటారు. ఈ నేపథ్యంలో అటు కొనుగోలుదారులకుగాని, ఇటు అమ్మకందారులకు గాని గుక్కెడు నీరు అందుబాటులో లేదు. దగ్గరలో ఉన్న కూల్‌డ్రింక్ షాపులే దిక్కు. ఇదే అదునుగా ఆ షాపులవారు సైతం దోపిడీకి పాల్పడుతున్నారు. కూల్‌డ్రింక్స్ షాపుల ప్రతీ రోజు లూజు వాటర్‌ను విక్రయిస్తూ.. ఆదివారం సంత రోజు మాత్రం లూజ్ వాటర్ లేదని సీల్ బాళ్లు మాత్రమే ఉన్నాయంటూ విక్రయిస్తున్నారు. తద్వారా వారి నీళ్ల వ్యాపారాన్ని రెట్టింపు చేసుకుంటున్నారు. చేసేదేమీ లేక సంతలోని కొనుగోలుదారులు, విక్రయదారులు మూడు నుంచి నాలుగు వాటర్ సీల్ బాటిళ్లను రూ.60 నుంచి 80 వరకు వెచ్చించి కొనుగోలు చేస్తున్నారు.

ఇక మరుగుదొడ్లు లేకపోవడం మరో సమస్య. సంతకు వచ్చిన కొనుగోలుదారులు, చిరు వ్యాపారులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. 12 గంటల పాటు వ్యాపారాలను కొనసాగించే చిరు వ్యాపారులు సుమారు 5 నుంచి 6 గంటల పాటు సంతలో సరుకులు కొనుగోలు చేసే కొనుగోలుదారులకు మరుగుదొడ్లు లేకపోవడం సమస్య తీవ్రతను వ్యక్త పరుస్తోంది. ఊరు బయట ఉండే పంట పొలాలు, చెరువులనే మరుగుదొడ్లుగా వినియోగించుకోవాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. సంతలో ఇబ్బందులు పంచాయతీ అధికారులకు, ప్రజాప్రతినిధులకు తెలిసినప్పటికీ పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడాన్ని జనం తీవ్రంగా తప్పుబడుతున్నారు.

తాగునీటి సౌకర్యం కల్పించాలి



సంతలో తాగేందుకు మంచినీళ్లు కూడా దొరకడం లేదు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సంతలో సరుకులు అమ్ముకునేందుకు వచ్చిన వారం 10 నుంచి 12 గంటల పాటు సంతలోనే గడపాల్సి వస్తుండగా, పంచాయతీ వారు కనీసం మంచినీటి సౌకర్యం కూడా కల్పించకపోవడం బాధాకరం. వ్యాపారుల వద్ద నుంచి వసూళ్లు చేస్తున్న పన్నులతోనైనా మంచినీటి వసతి కల్పిస్తే బాగుంటుంది.

– రాజమ్మ, చిరు వ్యాపారి, వెంకటాపురం

మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలి



సంతలో మరుగుదొడ్లు లేకపోవడంతో తీవ ఇబ్బందులు పడాల్సి వస్తోంది. వ్యాపారాల కోసం వచ్చే చిరువ్యాపారుల్లో మహిళలే ఎక్కువగా ఉండడంతో అత్యవసర పరిస్థితుల్లో ఆరు బయటకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. పన్నులు వసూలు చేస్తున్నప్పటికీ కనీస సౌకర్యాలు కల్పించడం లేదు. కనీసం మరుగుదొడ్లు అయినా ఏర్పాటు చేస్తే కొంత ఇబ్బంది తొలుగుతుంది.

– కొండా చరణ్, సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ డివిజన్ నాయకుడు

నేటి నుంచి మారాయిగూడెం జాతర


విద్యుత్ కాంతులతో ఆలయ ముఖ ద్వారం

దుమ్ముగూడెం: మండలంలోని మినీ మేడారంగా కొలవబడే మారాయిగూడెం సమ్మక్క–సారలమ్మ జాతర నేటి నుంచి ప్రారంభం కానుంది. ఐదు రోజుల పాటు అంగరంగవైభవంగా జాతరను నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రాంగణమంతా విద్యుత్ కాంతులతో అలంకరించారు. జాతరకు 5 రాష్ట్రాల నుంచి జాతరకు వచ్చే భక్త జనం రానున్నారు. 28న సారలమ్మను గద్దె మీదకు తీసుకొస్తారు. 29న వన దేవతలను, సమ్మక్కను భక్తజన సందోహం నడుమ గద్దెల పైకి తీసుకుని రావడంతో నిండు జాతర ప్రారంభం అవుతుంది. దీంతో భక్తులు తరలివచ్చి తమ మొక్కుబడులను అమ్మవార్లకు చెల్లించుకుంటారు.

ఏర్పాట్ల పరిశీలన..

మారాయిగూడెం జాతరకు తరలివచ్చే భక్తుల కోసం పంచాయతీ ఆధ్వర్యంలో చేపట్టిన పనులను ఎంపీఓ ముత్యాలరావు పరిశీలించారు. ఆలయ ప్రాంగణంలో ముమ్మరంగా శానిటేషన్ పనులను చేపట్టి, వాటర్ ట్యాంకులను శుభ్రపరిచారు. మంచినీరు సరఫరా, శానిటేషన్ పనులను ఐదు రోజుల పాటు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు.ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాస్, ప్రసాద్‌రెడ్డిలు ఉన్నారు.

న్యాయ కళాశాలను ఏర్పాటు చేయాలి

భద్రాచలంటౌన్: భద్రాచలం కేంద్రంగా గిరిజన న్యాయ కళాశాలను ఏర్పాటు చేయాలని గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ అన్నారు. స్థానిక ఐటీడీఏ ప్రాంగణలో గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి అధ్యక్షతన జరిగిన ముఖ్య నాయకులు సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.గిరిజన న్యాయ కళాశాల సాధన కోసం మార్చి 4న భద్రాచలం ఐటీడీఏ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న ధర్నాకు ఆదివాసీ గిరిజన యువత పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో గడ్డం వెంకన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

చర్ల: భద్రాచలంలో ఆదివాసీల కోసం ప్రత్యేకంగా ఆదివాసీ న్యాయ కళాశాలను ఏర్పాటు చేయాలని జీఎస్‌పీ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయిదొర డిమాండ్ చేశారు. సోమవారం చర్లలో జీఎస్‌పీ నాయకులు కనితి వెంకటకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏజెన్సీలో యువత డిగ్రీలు, పీజీలు పూర్తి చేసి నిరుద్యోగులుగానే ఉంటున్నారని, భద్రాచలంలో ఆదివాసీల కోసం న్యాయ కళాశాలను ఏర్పాటు చేసినట్లయితే ఆదివాసీ యువతీ యువకులు న్యాయ కళాశాలలో విద్యాభ్యాసం చేసే అవకాశం ఉంటుందన్నారు. న్యాయ కళాశాల ఏర్పాటు కోసం ఆదివాసీలంతా ఐక్యంగా ఉద్యమించాల్సి ఉందని అన్నారు. సమావేశంలో నాయకులు పూనెం వెంకటేష్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కైలాసగౌరి నోము

అశ్వారావుపేటరూరల్: స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో సోమవారం సామూహిక కైలాస గౌరి నోములు కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. లోక కల్యాణం, మహిళలు తమ సౌభాగ్యం కోసం ఈ నోములను చేపట్టారు. ఈ సందర్భంగా మహిళలను పార్వతి, పరమేశ్వరులుగా భావించి ప్రత్యేక పూజలు చేసి, పసుపు కుంకాలు, తాంబూలాలు సమర్పించారు. వారి ఆశీర్వచనాలు తీసుకున్నారు. మహిళలు అధిక సంఖ్యలో తరలిరాగా, ఆలయం భక్తులతో పోటెత్తింది.

కృష్ణకుమారికి ఘన నివాళి

మణుగూరురూరల్: మండల పరిధిలోని పగిడేరు గ్రామపంచాయతీ ఎంపీటీసీ, సీపీఎం నాయకురాలు కుంజా కృష్ణకుమారి ఇటీవలే అనారోగ్యంతో మరణించగా.. సోమవారం ఆమె దశ దినకర్మలు నిర్వహించారు. కార్యక్రమానికి సీపీఐ మహిళా జిల్లా సమైక్య కార్యదర్శి మున్నా లక్ష్మీకుమారి, పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్, గిరిజన సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుటుంబరావు, జిల్లాసమితి సభ్యులు సర్వర్‌లు హాజరై కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం పగిడేరు గ్రామంలో ఏర్పాటు చేసిన కుంజా కృష్ణకుమారి స్మారక స్థూపం వద్ద ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళ్లు అర్పించారు. కుంజా కృష్ణకుమారి చేసిన సేవలను కొనియాడారు.



మణుగూరురూరల్: సభలో మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి

సంస్మరణ సభ..

ప్రజా సమస్యల పరిష్కారం ఎర్రజెండాతోనే సాధ్యమని సీపీఎం రాష్ట్ర్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు, ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి అన్నారు. ఎంపీటీసీ కుంజా కృష్ణకుమారి సంస్మరణ సభను సోమవారం ఆ పార్టీ మండల కార్యదర్శి కొడిశాల రాములు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరై మల్లు లక్ష్మితో పాటు మాజీ ఎంపి మిడియం బాబురావు, పార్టీ జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్యలు కుంజా కృష్ణకుమారి సేవలను కొనియాడారు. సభలో ఐద్వా జిల్లా కార్యదర్శి ఎం.జ్యోతి, సీనియర్ నాయకులు గద్దల శ్రీనివాసరావు, నెల్లూరి నాగేశ్వరరావు, నిమ్మల వెంకన్న, వెంకటేశ్వర్లు, కాంతారావు, నరసింహారావు, దామల్ల లెనిన్ బాబు, సాంబశివరావు, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

తహసీల్దార్ బదిలీ

అశ్వారావుపేటరూరల్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సొంత పార్లమెంట్ నియోజకవర్గంలో పని చేస్తున్న అధికారులను బదిలీ చేయాల్సిందిగా ఎన్నికల కమిషన్ ఆదేశించిన సంగతి తెలిసిందే. దాంతో ఖమ్మం పార్లమెంట్‌కు చెందిన అశ్వారావుపేట తహసీల్దార్ కృష్ణ ప్రసాద్‌ను ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం ఉన్నతాధికారులు బూర్గంపహాడ్ మండలానికి బదిలీ చేస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

దమ్మపేట: రోడ్డు ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలైన సంఘటన మండల కేంద్రంలోని గాయత్రి ఆశ్రమం సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని మందలపల్లి గ్రామానికి చెందిన కటారి పుల్లయ్య (45), కాల్వ నాగరాజు (20)లు సోమవారం రాత్రి ద్విచక్ర వాహనంపై దమ్మపేట గ్రామానికి వచ్చి తిరిగి మందలపల్లికి వెళుతున్నారు. ఈ క్రమంలో దమ్మపేట గ్రామ శివారులోని గాయత్రి ఆశ్రమం సమీపంలో బైక్ అదుపుతప్పి కిందపడ్డారు. తలలకు తీవ్రగాయాలు రక్తస్రావంతో ఉండటాన్ని స్థానికులు గమనించి స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వారి పరిస్థితి విషమంగా ఉందని డాక్టర్లు చెప్పడంతో అంబులెన్స్‌లో సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

కాంగ్రెస్ నాయకుల వితరణ

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామానికి చెందిన సున్నం లలిత గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతుండటంతో సోమవారం కాంగ్రెస్ నాయకులు పరామర్శించి 50 కేజీల బియ్యం, రూ.2 వేలు నగదు వితరణగా అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కమటం నరేష్, స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పరీక్ష ప్యాడ్లు పంపిణీ

కరకగూడెం: మండలంలోని అనంతారం జెడ్పీ పాఠశాలలో సోమవారం ఆ పాఠశాల పదో తరగతి విద్యార్థులతో పాటు భట్టుపల్లి, కరకగూడెం పాఠశాలలకు చెందిన సుమారు 20మంది విద్యార్థులకు మణుగూరు ఎస్‌కేటీ ట్రస్ట్ అధ్యక్షుడు దోసపటి రంగారావు ఉచితంగా పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ధైర్యంగా పరీక్షలు రాసి, ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాలల హెచ్‌ఎంలు రఘురాం ప్రసాద్, అశోక్, ఉపాధ్యాయులు రాజా, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

అడవులను తగలబెట్టొద్దు

బూర్గంపాడు: తునికాకు సేకరణకు అడవులను తగలబెట్టే విధానాలను మానుకుని పర్యావరణాన్ని పరిరక్షించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ నాయకుడు డి.పున్నంచంద్ కోరారు. సోమవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో తునికాకు కాంట్రాక్టర్ల స్వలాభం కోసం అడవులను కాల్చివేయడాన్ని నిలిపివేయాలని కోరారు. ఈ ఘటనలపై ఫారెస్ట్ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సీసీ రోడ్ల నిర్మాణం ప్రారంభం


దుమ్ముగూడెం: కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు

దుమ్ముగూడెం: మండలంలోని కొత్త దంతెనం గ్రామపంచాయతీలో ఎన్ఆర్‌జీఎస్ నిధులు రూ.10 లక్షలతో చేపట్టే గ్రావెల్ రోడ్డు, సీడీపీ నిధులు రూ.5 లక్షలతో చేపట్టే సీసీ రోడ్డు నిర్మాణ పనులను భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు కొబ్బరికాయ కొట్టి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రోడ్డు నిర్మాణ పనులను నాణ్యతగా చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ రేసు లక్ష్మి, జెడ్పీటీసీ తెల్లం సీతమ్మ, బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు అన్నె సత్యనారయణమూర్తి, కణితి రాముడు, నాయకులు తునికి కామేశ్వరరావు, అపకా వీర్రాజు, దామెర్ల శ్రీనివాసరావు, తోట రమేష్, మోతుకూరి శ్రీకాంత్, కొత్త మల్లేశ్వరరావు, బొల్లి శేఖర్, కాల్వ పూర్ణయ్య, పొడియం సుబ్బారావు, పిట్టా పూర్ణయ్య, కొండపల్లి నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో..

మణుగూరురూరల్: మండలంలోని విప్పలసింగారం గ్రామపంచాయతీలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మంజూరు చేసిన రూ.18లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు సోమవారం కాంగ్రెస్ నాయకులు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ గోరంట్ల కనకయ్య, పాల్వంచ రాములు, పాల్వంచ సత్యం, కల్యాణ్, గంజాయి శంకర్, తిగుళ్ల రాములు, తిగుళ్ల గోపయ్య, ఏనిక కామరాజు, కందుకూరి శైలేష్, సలీం, పాల్వంచ శ్రీను, బ్రహ్మం, పంచాయతీ ప్రజలు పాల్గొన్నారు.

ములకలపల్లి: మండలకేంద్రంలోని ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి డబుల్ బెడ్‌రూం ఇళ్ల వరకూ సీసీ రోడ్డు నిర్మాణానికి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్‌రావు సోమవారం భూమిపూజ చేశారు. డబుల్ ఇళ్లకు మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా తొలివిడతగా రూ.25 లక్షలతో వ్యయంతో రోడ్డు నిర్మిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు పువ్వాల మంగపతి, శ్రీరాముల నాగేశ్వరరావు, శనగపాటి రవి, సురభి రాజేశ్, కటికనేని ఆదిత్య, పొన్నూరి హరి, దుగ్గి సంపత్ తదితరులు పాల్గొన్నారు.

మంచాన పడ్డ రాళ్లగూడెం

చర్లరూరల్: వైరల్ జ్వరాలతో పాటు కీళ్ల నొప్పులతో చర్ల మండలంలోని రాళ్లగూడెంలోని జనం మంచాన పడ్డారు. గ్రామంలో ఎక్కడ చూసినా జ్వరాలతో బాధపడుతున్నవారే కనిపిస్తున్నారు. కొంతమందికి మూడు, నాలుగు రోజుల్లో జ్వరాలు తగ్గినప్పటికీ విపరీతమైన కీళ్ల నొప్పులతో తీవ్రంగా బాధపడుతున్నారు. మరి కొంతమంది కర్రల సాయంతోనే ఇంకా నడుస్తున్నారు. గత కొద్ది రోజులుగా చర్ల మండలంలోని కలివేరు, కొత్తపల్లి గ్రామాల్లోని ప్రజలు వైరల్ జ్వరాలతో బాధపడుతూ ఉండడంతో ఆయా గ్రామాల్లో వైద్య సిబ్బంది అప్రమత్తమైంది. వైద్య శిబిరాలతో పాటు ఇంటింటి సర్వేలు సైతం నిర్వహించారు. దాంతో కొంత వరకు జ్వరాలు అదుపులోకి వచ్చాయి.

ప్రస్తుతం అదే పరిస్థితిలో ఉన్న రాళ్లగూడెంపైనా వైద్య సిబ్బంది దృష్టి సారించారు. అందులో భాగంగా కొయ్యూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. జ్వర బాధితుల నుంచి రక్త నమూనాలు సేకరించారు. ఈ సందర్భంగా కొయ్యూరు పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీధర్ మాట్లాడుతూ.. చికెన్‌గున్యా లక్షణాలు లేవని, వైరల్ జ్వరాల వల్లనే ఒళ్లు నొప్పులు, కీళ్ళ నొప్పులు వస్తున్నాయని తెలిపారు. కలుషిత నీటిని తాగడం వల్ల కూడా వైరల్ ఫీవర్స్ వస్తాయని, కాచి చల్లార్చిన నీటినే తాగాలని సూచించారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ


కరకగూడెం సీసీ ఫుటేజీని పరిశీలిస్తున్న డీఎస్పీ రవీందర్ రెడ్డి

కరకగూడెం: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను మణుగూరు డీఎస్పీ రవీందర్ రెడ్డి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, రిసెప్షన్, లాకప్, సీసీ ఫుటేజీ, పరిసరాలను పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడి వారి విధులకు సంబంధించిన సూచనలు చేశారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అంతేకాకుండా ఎళ్లవేళలా ఫిర్యాదులు స్వీకరించడం, బాధితుల ఫిర్యాదుపై సత్వరం స్పందించి సేవలు అందించాలని సూచించారు. సైబర్ నేరాలపై ప్రజలను చైతన్య పరచాలని, అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ఏ.రాజేందర్, పోలీస్ సిబ్బంది తదితరులున్నారు.

అప్రమత్తంగా ఉండండి

మణుగూరుటౌన్: అపరిచితులు, కొత్తవారు సంచరిస్తే తమ బాధ్యతగా పోలీసులకు సమాచారం అందించాలని మణుగూరు సీఐ సతీష్ ప్రజలకు సూచించారు. సోమవారం మణుగూరు మండలంలోని మారుమూల ఆదివాసీ గ్రామాలైన రేగులగండి, సర్వాయిగుంపును సందర్శించి గ్రామస్తులతో మాట్లాడారు. అపరిచితుల నుంచి ఏ సమస్య ఎదురైనా పోలీసులందరం అండగా ఉంటామని ధైర్యం కల్పించారు. ఏదైనా సమస్య ఉంటే సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. పిల్లలను విధిగా పాఠశాలలకు పంపించాలని సూచించారు. నాటుసారా, గుడుంబా రవాణా చట్టరీత్యా నేరమని అలాంటి కార్యకలాపాలకు దూరంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ రామకృష్ణ తదితరులు ఉన్నారు.

సమ్మె నోటీస్ అందజేత

భద్రాచలంఅర్బన్: గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ వర్కర్లు నేటి నుంచి సమ్మెలో పాల్గొంటున్నట్లుగా శనివారం సీఐటీయూ నాయకుల ఆధ్వర్యంలో ఐటీడీఏ అధికారులకు సమ్మె నోటీస్ అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మాచారి మాట్లాడుతూ.. గడిచిన 18 నెలలుగా బకాయి ఉన్న వేతనాలు చెల్లించాలని కోరుతూ ఇప్పటికే అనేక సార్లు ఆందోళనలు, పోరాటాలు నిర్వహించినట్లు తెలిపారు. గత ప్రభుత్వంలోని ఎమ్మెల్యేలు, మంత్రులకు అనేక సార్లు వినతి పత్రాలు అందజేశామని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో సైతం పలువురు మంత్రులకు వినతి పత్రాలు అందజేశామని బ్రహ్మాచారి అన్నారు. అయినప్పటికీ ఫలితం లేకపోవడంతో నేటి నుంచి ఔట్‌సోర్సింగ్ వర్కర్లు, డైలీ వేజ్ వర్కర్లు నిరవధిక సమ్మె చేస్తున్నట్లు ఆయన వివరించారు.

ఎస్పీపై చర్యలు తీసుకోవాలి

మణుగూరురూరల్: మేడారం జాతరలో బీట్ ఆఫీసర్ శ్రీనివాస్‌పై దాడికి పాల్పడిన అదిలాబాద్ ఎస్పీ గౌస్ ఆలంపై చర్యలు తీసుకోవాలని మణుగూరు డివిజన్ జూనియర్ ఫారెస్ట్ శాఖ అధికారుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఫారెస్ట్ డివిజన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో సంఘం డివిజన్ అధ్యక్షుడు వి.గోవిందు మాట్లాడుతూ.. జాతరలో బీట్ ఆఫీసర్ శ్రీనివాస్ తన భార్యతో కలిసి వనదేవతలను దర్శించుకుని పోలీస్ వారి అనుమతితో విధుల్లో హాజరయ్యేందుకు వెళ్తున్న క్రమంలో ఎస్పీ గౌస్ ఆలం దాడి చేయడం సరికాదని, దీనిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులతో పాటు మంత్రికి ఫిర్యాదు చేయనున్నామని తెలిపారు. సమావేశంలో జూనియర్ అటవీశాఖ అధికారుల సంఘం డివిజన్ ఉపాధ్యక్షుడు ఎర్రయ్య, ప్రధాన కార్యదర్శి పి.శ్యామ్, అరుణ, బాబురావు, భీమ్‌చందర్ తదితరులు పాల్గొన్నారు.

సామూహిక సీమంతాలు

బూర్గంపాడు: ఐటీసీ మిషన్ సునేహ్రా కల్(ఎంఎస్‌కే) ఆధ్వర్యంలో సోమవారం ఇరవెండి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక సీమంతాలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన పోషకాహారంపై అవగాహన కల్పించారు. న్యూట్రీషియన్ లోపంతో వచ్చే ఆరోగ్య సమస్యలను వివరించారు. కార్యక్రమంలో ఐటీసీ ఎంఎస్‌కే ప్రతినిధులు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బాలుర వసతి గృహంలో వైద్యశిబిరం

మణుగూరురూరల్: మండలంలోని రాజీవ్‌గాంధీనగర్‌లో ఉన్న మహాత్మా జ్యోతిరావుపూలే బీసీ బాలుర వసతి గృహంలో మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో వైద్యాధికారి డాక్టర్ శివకుమార్ విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి నివారణ మందులు పంపిణీ చేశారు. అనంతరం వైద్యాధికారి శివకుమార్ మాట్లాడుతూ... వ్యక్తిగత శుభ్రత పాటించాలని విద్యార్థులకు సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని వసతి గృహ నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఏ రాంప్రసాద్, రవి, ఏఎన్ఎం విజయలక్ష్మి, భవాని తదితరులు పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేయండి


బాధిత రైతులతో కలిసి పంటను పరిశీలిస్తున్న ఏఈఓ, సంస్థ ప్రతినిధులు

ములకలపల్లి: వరిచేలు 60 రోజుల వ్యవధిలోనే ఈనాయని, దీంతో తాలు కంకులు ఏర్పడ్డాయని తమకు న్యాయం చేయాలని గిరిజన రైతులు వేడుకుంటున్నారు. మండలపరిధిలోని తాళ్లపాయ గ్రామానికి చెందిన పలువురు రైతుల సాగు చేస్తున్న వరిచేలో సుమారు 50 ఎకరాల పంట నిర్ణీత కాలవ్యవధికంటే ముందే ఈనడంతో, కంకులు వేశాయి. ముందే పక్వానికి రావడంతో దుబ్బుకట్టకుండా బలహీనంగా మారింది. దీంతో తాలు కంకులు ఏర్పడుతున్నాయి. ఈ నేపథ్యంలో పంట దిగుబడి తగ్గిపోయే ప్రమాదముందని రైతులు ఆందోళన చెందుతున్నారు. విత్తన లోపంవల్లే సమస్య తలెత్తిందని రైతులు ఆరోపిస్తున్నారు. విషయం తెలుసుకున్న విత్తన సంస్థ ప్రతినిధులు, ఏఈఓ రమేశ్‌తో కలసి సోమవారం చేలలో పర్యటించారు. బాధిత రైతులతో మాట్లాడి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమగ్ర నివేదిక రూపొందించి పైఅధికారులకు అందజేస్తామని ఏఈఓ రమేశ్ తెలిపారు.